## క్లుప్తంగా

### ఆస్పత్రి అనుమతులు రద్దు చేయాలి

**తాడూరు:** జిల్లా కేంద్రంలోని ప్రియాంక ఆస్పత్రి వైద్యులు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని వారి అనుమతిని రద్దు చేయాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కాశన్న డిమాండ్ చేశారు. శనివారం నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. మండల కేంద్రానికి చెందిన దళిత మహిళ మృతికి కారణమైన వారిపై అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఇష్టానుసారంగా ఫీజులు పెంచుతూ బడుగుబలహీన వర్గాల ప్రజలను ఆసరా చేసుకొని ప్రైవేట్ ఆస్పత్రులు దోచుకుంటున్నాయన్నారు. కార్యక్రమంలో శంకర్, చంద్రయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ



**నాగర్‌కర్నూల్:** స్థానిక జ్ఞానేశ్వర వాత్సల్య మందిరం, జ్ఞాన సరస్వతి బాల కల్యాణ్ ఆశ్రమంలో 40 మంది బాలబాలికలకు మ్యాన్కైండ్ ఫార్మా వారి ఆధ్వర్యంలో లంచ్ బాక్స్, వాటర్ బాటిల్, రాత పరికరాలతో కూడిన బ్యాగులను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ రోహిత్, శ్రీధర్, రాజ్‌కుమార్, సుదర్శన్, భూపాల్ రెడ్డి పాల్గొన్నారు.

### ఎమ్మెల్సీ గెలుపుపై కాంగ్రెస్ సంబరాలు

**నాగర్‌కర్నూల్‌రూరల్:** పట్టాభద్రుల ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్న గెలవడంపై శనివారం పట్టణంలో ఆయన అభిమానులు సంబరాలు నిర్వహించారు. ప్రజల వెంట ఉంటూ, ప్రజల గోస తెలిసిన నాయకుడిగా ఉద్యమాలలో అలుపెరగని పోరాటం నిర్వహించి ఎమ్మెల్సీగా గెలుపొందడం హర్షించదగ్గ విషయం అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్ వల్లే సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో జమ్ముల సతీష్‌రెడ్డి, శ్రీనివాస్, కౌన్సిలర్‌లు నిజాం, బాదం సురేందర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

**కొల్లాపూర్:** పట్టభద్రుల ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్న గెలుపు సాధించడంపై పట్టణంలో ఆయన అభిమానులు హర్షం ప్రకటించారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చౌరస్తాలో టపాసులు కాల్చారు. కార్యక్రమంలో వేణుగోపాల్‌యాదవ్, రాజశేఖర్, కిరణ్, అన్వర్, స్వామి, రాందాసు ఉన్నారు.

### 'నీట్' పేపర్ లీకేజీపై విచారణ చేయాలి

**కొల్లాపూర్:** నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై విచారణ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాలపై అనేక ఆరోపణలు వస్తున్నాయన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన పరీక్షల్లో పారదర్శకత లోపించినట్లు ఆరోపించారు. ఒక సెంటర్‌లో పరీక్ష రాసిన ఆరుగురు విద్యార్థులకు వంద శాతం మార్కులు రావడం యాదృచ్ఛికం కాదన్నారు. పరీక్షల నిర్వహణ తీరుపై, పేపర్ లీకేజీ అంశాలపై జ్యుడీషియల్ విచారణ చేయాలని కోరారు.

### రామోజీరావుకు ఘన నివాళి



**నాగర్‌కర్నూల్:** పత్రికారంగానికి దిక్సూచిగా, జర్నలిజానికి మార్గదర్శిగా నిలిచిన రామోజీరావు ఆశయ సాధన కోసం ముందుకు వెళ్దామని సీనియర్ జర్నలిస్టులు అబ్దుల్లా ఖాన్, జెమిని సురేష్, ఈనాడు సురేష్, చంద్రశేఖరరావు, రాజేష్‌గౌడ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి జర్నలిస్టులు ఘనంగా నివాళులు అర్పించారు.

**తెలకపల్లి:** మండల కేంద్రంలోని నెహ్రూ చౌరస్తాలో రామోజీరావు చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో యాదయ్య, నిరంజన్, మల్లయ్య, బద్దెనాయక్ పాల్గొన్నారు.

### ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు

**అమ్రాబాద్:** మండలంలోని జంగంరెడ్డిపల్లిలో పడమర వైపు పంటపొలాలకు వెళ్లే డొంక దారి వెంట ఉన్న విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ డొంక దారివెంట నిత్యం వందల మంది ప్రజలతో పాటు పశువులు తిరుగుతుంటాయి. వైర్లు చేతికందే ఎత్తులో ఉండటం వల్ల ఏసమయంలోనైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వైర్లను సరి చేయించాలని కోరుతున్నారు.



# రోడ్ల నిర్వహణ గాలికి



అధ్వానంగా ఉన్న ఉప్పునుంతల- కొత్తరాంనగర్ రోడ్డు

- వర్షాలకు రోడ్లపై గుంతలు పడి బురదమయం
- ఏళ్ల తరబడిగా మరమ్మతుకు నోచుకోని వైనం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు, రైతులు

**ఉప్పునుంతల:** మండలంలో మట్టి రోడ్ల అభివృద్ధికి ఏళ్ల తరబడి మోక్షం కలగడం లేదు. గ్రామాలను కలుపుతూ ఉన్న అంతర్గత రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. మరమ్మతులకు నోచుకోని రోడ్లపై ప్రయాణించడం ప్రజలకు నరకయాతనగా మారింది. ప్రస్తుత వర్షాలకు ఏర్పడిన గుంతలో నీరు నిలిచి బురమయంగా మారాయి. రోడ్లను బాగుచేయించడంలో అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఏమాత్రం పట్టింపులేకుండా ఉంది. కొన్నేళ్లుగా గ్రామీణ రోడ్ల నిర్వహణ గాలికొదిలేశారు. రోడ్లకు ఇరువైపుల కంపచెట్లు కమ్ముకొని బండ్ల డొంకలను తలపిస్తున్నాయి. గతంలో మెటల్ రోడ్లుగా వేసి తర్వాత పట్టించుకోకపోవడంతో కంకర లేసిపోయి వెళ్లడం కష్టంగా మారింది. ఉప్పునుంతల నుంచి కొత్త రాంనగర్ రోడ్డు మార్గం పూర్తిగా ఇబ్బందిగా ఉంది. నల్లచెరువుకట్టపై నుంచి ఉన్న రోడ్డుపై గుంతలు పడ్డాయి. ఉప్పునుంతల నుంచి పెద్దాపూర్ వరకు మట్టి రోడ్డు వెంట కంపచెట్లు కమ్ముకున్నాయి. అదేవిధంగా మొల్గర- ఉప్పునుంతల రోడ్డుకు ఇరువైపుల రైతులు దగ్గరగా దున్నడంతో డొంకమార్గంగా తయారైంది. ఈ రోడ్డును కొన్నేళ్ల క్రితం కొంతదూరం మెటల్ రోడ్డుగా మార్చి, తిరిగి పట్టించుకోకపోవడంతో అధ్వాన స్థితికి చేరింది.



నిర్వహణ లేని ఉప్పునుంతల బర్లడొంక రోడ్డు

ఉప్పునుంతల నుంచి అచ్చంపేట రోడ్డును కలుపుతూ బైపాస్ రోడ్డుగా ఉన్న బర్లడొంక రోడ్డు మరింత అధ్వానంగా తయారైంది. మర్రిపల్లి నుంచి గట్టుతుమ్మెన్ స్టేజీ వరకు రెండున్నర కిలోమీటర్ల దూరం ఉన్న రోడ్డుపై కంకర లేచి వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. అదేవిధంగా మర్రిపల్లి నుంచి లక్ష్మాపూర్ వరకు ఉన్న రోడ్డు వెంట కంకర లేచి వాహనాలు వెళ్లడానికి ఇబ్బందిగా మారింది. దాసర్లపల్లి నుంచి పెద్దాపూర్ వరకు, సదగోడు నుంచి తిర్మలాపూర్ వరకు ఉన్న మట్టి రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. శ్యాండ్‌క్వారీ రోడ్డు నుంచి కొరటికల్ వరకు బీటీ రోడ్డు మంజూరైనా పనులు నత్తనడకన సాగుతున్నాయి. కొరటికల్ నుంచి చాకలి గుడిసెల వరకు మట్టి రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. అయ్యవారిపల్లి నుంచి తండా వరకు మట్టి రోడ్డు, కొరటికల్ పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి వెల్టూరు వరకు ఉన్న లింక్‌రోడ్డు ఇబ్బందిగా ఉంది. కాంసానిపల్లి తండా నుంచి రంగంపేట మీదుగా ఉన్న మెటల్ రోడ్డుపై వేసిన కంకర లేసింది.



చెట్లు కమ్ముకొని ఇబ్బందిగా మారిన ఉప్పునుంతల- మొల్గర రోడ్డు

#### పట్టించుకోవడం లేదు..



మండల కేంద్రానికి దగ్గరలో ఉందనేదే కాని మా ఊరు రోడ్డును ఎవరూ పట్టించుకోవడంలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై గుంతల్లో నీరు నిలిచి కనీసం బైక్‌లు వెళ్లడానికి కూడా ఇబ్బందిగా ఉంది. అత్యవసర సమయాల్లో అంబులెన్స్ రాని పరిస్థితిలో మా ఊరి రోడ్డు ఉంది. ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సమస్య పరిష్కరించాలి.

– గుర్రపు మల్లయ్య, కొత్తరాంనగర్

#### ప్రతిపాదనలు అడగలేదు

మండలంలో ఇబ్బందిగా ఉన్న మట్టి రోడ్ల అభివృద్ధికి ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ప్రతిపాదనలు అడగలేదు. ఉప్పరిపల్లి నుంచి మామిళ్లపల్లి వరకు మంజూరైన బీటీ రోడ్డు పనులు పూర్తయ్యాయి. శ్యాండ్‌క్వారీ రోడ్డు నుంచి కొరటికల్ వరకు మంజూరైన బీటీ రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. ఎన్నికల కోడ్ ముగిసినందున మండలంలో మట్టి రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రతిపాదనలు అడిగితే పంపించడానికి సిద్ధంగా ఉన్నాం.

– సందీప్‌రెడ్డి, ఏఈ, పీఆర్

#### నామమాత్రంగా మరమ్మతులు

మండలంలోని బీటీ రోడ్ల వెంట నామమాత్రంగా నిర్వహణ పనులు చేస్తున్నారు. పనుల నాణ్యతపై అధికారులు ఏమాత్రం పట్టింపులేకుండా వ్యవహరిస్తున్నారు. గతేడాది ఉప్పునుంతల నుంచి మర్రిపల్లి వరకు వేసిన బీటీ రోడ్డు పనులు నామమాత్రంగా చేసి వదిలేశారు. బీటీరోడ్డు అంచుల వెంట మట్టి సరిగా వేయకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. తాడూరు నుంచి ఉప్పునుంతల వరకు వేసిన బీటీ రోడ్డు కంకర లేసి పూర్తిగా ధ్వంసమైంది. ఈరట్వానిపల్లి నుంచి పెనిమిళ్ల వరకు, పెనిమిళ్ల నుంచి సీబీ తండా వరకు ఉన్న బీటీ రోడ్ల నిర్వహణ పనులు చేపట్టడం లేదు. దీంతో బీటీ రోడ్లు ఉన్నాయన్న పేరేగాని గుంతలు పడి మట్టి రోడ్లకంటే అధ్వానంగా తయారయ్యాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## డబుల్ బెడ్రూం ఇళ్లు వెంటనే కేటాయించాలి



సమావేశమైన లబ్ధిదారులు

**కల్వకుర్తిరూరల్:** ఎన్నికలకు ముందు నిబంధనల ప్రకారం కలెక్టర్ ఆదేశాలతో లక్కీడ్రా నిర్వహించి ఎంపిక చేసిన లబ్ధిదారులకు వెంటనే డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. 8 నెలలుగా ఇళ్లు కేటాయించడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. ఇళ్లు ఇవ్వకపోతే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మల్లయ్య, రమేష్ చారి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**కొల్లాపూర్:** ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చేపట్టాలని, విద్యా హక్కు చట్టం అమలు చేయాలని బీఆర్ఎస్వీ నాయకుడు శేఖర్, బీఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి దాసు డిమాండ్ చేశారు. వారు శనివారం ఎంఈఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం మంది పేద విద్యార్థులకు ఉచిత విద్య అందేలా చూడాలన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులను పరిశీలించాలని, విద్యార్థుల ట్రాన్స్‌పోర్టు వాహనాల ఫిట్‌నెస్‌ను పరీక్షించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీచేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గణేష్, శివ తదితరులున్నారు.

## లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం



కల్వకుర్తిలో మాట్లాడుతున్న జడ్జిలు శ్రీదేవి, కావ్య

**కొల్లాపూర్:** పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. మెజిస్ట్రేట్ శ్రీనిధి సమక్షంలో పలువురు కక్షిదారులు రాజీపడ్డారు. నియోజకవర్గంలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో గల 18 కేసులు రాజీమార్గంలో పరిష్కారమయ్యాయి. ఎక్సైజ్ శాఖకు సంబంధించిన 28 కేసుల్లో నిందితులకు అపరాధ రుసుములు విధించారు. పెట్టి చలాన్‌లకు సంబంధించిన 1,710 కేసులతో పాటు, 3 సైబర్ క్రైం కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కారం అయ్యాయి. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ మాట్లాడుతూ చిన్నపాటి తగాదాలు, వివాదాలను లోక్‌అదాలత్‌లో రాజీమార్గంలో పరిష్కరించుకోవడం మంచి మార్గమని సూచించారు. కార్యక్రమంలో లోక్‌అదాలత్ సభ్యులు ఆర్.కురుమూర్తి, మోహన్‌లాల్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్నె శ్రీహరి, న్యాయవాదులు ఉన్నారు.

**కల్వకుర్తి టౌన్:** కక్షిదారులు పంతాలకు పోకుండా వారి కేసుల విషయంలో రాజీమార్గంలో వెళితే పరిష్కారం లభిస్తుందని కల్వకుర్తి సీనియర్ సివిల్ కోర్టు జడ్జి శ్రీదేవి అన్నారు. శనివారం పట్టణంలోని సీనియర్ సివిల్ కోర్టులో నిర్వహించిన మెగా లోక్‌అదాలత్‌లో జూనియర్ సివిల్ జడ్జి కావ్యతో కలిసి ఆమె పాల్గొన్నారు. కోర్టు పరిధిలోని పలు కేసులకు సంబంధించి కక్షిదారులు రాజీ కుదుర్చుకున్నట్లుగా కోర్టు అధికారులు తెలిపారు. మెగా లోక్‌అదాలత్‌లో భాగంగా 1,207 కేసులు పరిష్కారం కాగా అందులో 19 పోలీస్ కేసులలో పలువురు రాజీపడ్డారు. 86 పోలీస్ కేసులలో నిందితులు నేరాన్ని అంగీకరించి రూ.2.69 లక్షల జరిమానాలను చెల్లించగా, 1,121 కేసులలో డ్రంకెన్‌డ్రైవ్ కేసులలో నిందితులు జరిమానా చెల్లించారు. పీపీ సరిత రాణి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకటరమణ, న్యాయవాదులు పాల్గొన్నారు.



కొల్లాపూర్‌లో కేసులు పరిష్కరిస్తున్న మెజిస్ట్రేట్ శ్రీనిధి

**లింగాల:** అచ్చంపేట కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో మండలానికి సంబంధించి 15 కేసులు పరిష్కారం అయినట్లు ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపారు. భూ సమస్యలు, భార్య భర్తల మధ్య గొడవలు, కుటుంబ కలహాలు తదితర సమస్యలపై కేసులు నమో దు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కేసులకు లోక్ అదాలత్‌లో సత్వర పరిష్కారం లభించినట్లు చెప్పారు.

## గ్రూపు-1 పరీక్షకు ఏర్పాట్లు



ఇన్విజిలెటర్లకు సూచనలు చేస్తున్న పరీక్ష నిర్వాహకులు

**తెలకపల్లి:** గ్రూపు-1 ప్రిలిమినరీ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రంలో 288 మంది, గోవర్ధన్‌రెడ్డి డిగ్రీ కళాశాలలో 312 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం ఈ రెండు పరీక్ష కేంద్రాల ఇన్విజిలెటర్ల సమావేశం నిర్వహించారు. పరీక్షలు ఎలా నిర్వహించాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి వాటిపై సూచనలు, సలహాలు చేశారు. పరీక్ష నిర్వహణలో ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. అభ్యర్థులు ఉదయం 9 గంటలకు కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చీఫ్ సూపరింటెంట్‌లు తిరుపతయ్య, రాజమహేందర్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, సందీప్‌కుమార్‌రెడ్డి, ఇన్విజిలెటర్లు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు పక్కన గుంత పూడ్చాలి



రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఏర్పడిన గుంత

**తాడూరు:** మండల కేంద్రంలో ప్రధాన మండల పరిషత్ కార్యాలయాల సముదాయాల వద్ద రోడ్డు పక్కన తవ్వి వదిలేసిన గుంతను పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు. మండల కార్యాలయాల ముందు నుంచి యాదిరెడ్డిపల్లి మీదుగా ఇంద్రకల్, ఐతోల్ వెళ్లే ప్రధాన రహదారి అయినా కార్యాలయాల ఎదుట వైఫై కేబుల్ లైన్ కోసం 4 నెలల క్రితం గుంతను తీసి పూడ్చకుండా వదిలేశారు. మండల కేంద్రానికి వచ్చే అధికారులు ప్రతి రోజు ఈ గుంతను దాటుకుంటూ వెళ్తారే తప్పా, పూడ్చి వేయాలన్న ఆలోచన రావడం లేదు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య



ఉప్పునుంతలలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

**పెద్దకొత్తపల్లి:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తున్నట్లు హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. చంద్రకల్‌లో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శనివారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేరిపించాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. ఉపాధ్యాయుడు నిరంజన్, సీఆర్‌పీ రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

**ఉప్పునుంతల:** మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు ఆయా గ్రామాల్లో బడిబాట కార్యక్రమాన్ని చేపట్టారు. ఉప్పునుంతల బాలుర ప్రాథమిక పాఠశాలలో గడచిన ఆరేళ్లలో 40 మంది విద్యార్థులు గురుకుల పాఠశాలలకు ఎంపిక కావడం జరిగిందని ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు వివరించారు.

**వెల్దండ:** మండలంలోని గ్రామాల్లో శనివారం ఉపాధ్యాయులు ఇంటింటి బడిబాట కార్యక్రమం నిర్వహించారు. గొల్లోనిపల్లిలో హెచ్ఎం రవి ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ఉంటుందన్నారు.

**తాడూరు:** బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం అంతారం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శేషగిరి ఆధ్వర్యంలో ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. పిల్లలంతా బడిలో ఉండేవిధంగా చూడాలని ఎంఈఓ భాస్కర్‌రెడ్డి ఆయా పాఠశాలల ఉపాధ్యాయులను కోరారు.



అంతారంలో ర్యాలీ..

### చోరీకి గురైన సెల్‌ఫోన్లు అప్పగింత



**వెల్దండ:** మండల కేంద్రంలోని సీఐ కార్యాలయంలో శనివారం సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి బాధితులకు మూడు సెల్‌ఫోన్లను అప్పగించారు. సీఐ మాట్లాడుతూ ఏప్రిల్ నెలలో చారకొండ మండలం సిర్సనగండ్ల ఉత్సవాల్లో సెల్‌ఫోన్లు చోరీకి గురైనట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. మూడు సెల్‌ఫోన్‌లను గుర్తించినట్లు సీఐ తెలిపారు. చారకొండ మండలం తిమ్మాయిపల్లికి చెందిన మల్లేష్, సురేష్, ఆమనగల్లు మండలం శెట్టిపల్లికి చెందిన రమేష్ అప్పగించినట్లు తెలిపారు.

### కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



**కొల్లాపూర్:** అచ్చంపేటలో శనివారం నిర్వహించిన తెలంగాణ తైక్వాండో కలర్ బెల్ట్ గ్రేడింగ్ పోటీల్లో పట్టణానికి చెందిన విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. అనీష్‌గౌడ్, అంశిత, మేఘన, రాకేష్, తేజస్ ఎల్లో బెల్ట్, రాధాకృష్ణయాదవ్, మనోహర్, అజిత్ ఎల్లో-1, అమ్మగారి గౌతమ్‌సాయి గ్రీన్ బెల్ట్‌లు సాధించారు. వీరికి తైక్వాండో జిల్లా జనరల్ సెక్రటరీ శేఖర్, మాస్టర్ శరబంద బెల్టులు ప్రదానం చేశారు.

### చేపమందు పంపిణీ



**కల్వకుర్తి టౌన్:** మృగశిర కార్తె సందర్భంగా పట్టణంలో వెంకటరమ హాస్పిటల్ ఎదురుగా చేపమందు పంపిణీ చేపట్టారు. ఉబ్బసం, అస్తమా లాంటి రోగాల నివారణకు చేపమందు బాగా పనిచేస్తుందని నిర్వాహకులు తెలిపారు. చేపమందు తీసుకున్న తర్వాత కొన్ని నియమాలు పాటించాలని, లేదంటే అనార్థాలకు దారితీస్తుందని వారు తెలియజేశారు. ఆదివారం సైతం చేపమందు పంపిణీ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

### 4.2 మి.మీ. వర్షపాతం

**కొల్లాపూర్:** పట్టణంలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు వర్షం కురిసింది. 4.2 మి.మీ.గా వర్షపాతం నమోదైంది. శనివారం సాయంత్రం నుంచి కూడా వర్షం పడింది. దీని కారణంగా రోడ్లు చిత్తడిగా మారాయి.

## వ్యవసాయ పనుల్లో నిమగ్నం



సింగిల్‌విండో నుంచి ఎరువులను తీసుకెళ్తున్న రైతులు

**తాడూరు:** వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షంతో రైతులు ఉత్సాహంగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. వానాకాలం సాగు తమను గట్టెక్కిస్తుందన్న కోటి ఆశలతో రైతులు ముందుగానే తమ పొలాలను చదును చేసుకుని విత్తనాలు విత్తుకున్నారు. విత్తుకున్న అనంతరం వర్షాలు కురవడంతో ఉత్సాహం రెట్టింపయ్యింది. దీంతో ముందస్తుగా ఎరువులపై దృష్టి సారించారు. అప్పటి పరిస్థితులు ఎలా ఉంటాయో అన్న ఆలోచనతో ముందుగానే రైతులు యూరియా, రసాయనిక ఎరువులను సిద్ధం చేసుకుంటున్నారు.

### ప్రతి ఇంటికి కొబ్బరి మొక్కలు

**లింగాల:** మండలంలోని అవుసలికుంటలో ఆర్డీటీ ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి 4 కొబ్బరి మొక్కలను అందజేస్తున్నట్లు ఆర్డీటీ ఏటీఎల్ రాధ శనివారం ప్రకటనలో తెలిపారు. మొక్కకు రూ.10 చెల్లించాల్సి ఉంటుందని, కావల్సిన వారు ఈ నెల 10వ తేదీ లోపు 8247445358, 8555912790 సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆమె కోరారు.